



## నేడు శ్రీశైలానికి నారా లోకేశ్



**శ్రీశైలం, జనవరి 31:** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ గురువారం శ్రీశైలం క్షేత్రానికి రానున్నారు. హైదరాబాద్‌లో బేగంపేట నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో గురువారం ఉదయం 8గంటలకు బయలుదేరి 9గంటలకు సున్నిపెంటకు చేరుకుంటారు. ఉదయం 9:30 గంటలకు సాక్షిగణపతి స్వామిని దర్శించుకుని తరువాత భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం 11:30గంటలకు సున్నిపెంటకు చేరుకుని మధ్యాహ్నం హైదరాబాద్‌కు చేరుకుంటారు.

# గురురాఘవేంద్రా.. ఇంత నిర్లక్ష్యమా?





బసలదొడ్డి పంప్ హౌస్

- టీడీపీ హయాంలో రూ.1,800 కోట్లతో శ్రీకారం
- లిఫ్టుల నిర్వహణకు ప్రణాళికాబద్ధంగా నిధులు
- జగన్ వచ్చాక ఓ అండ్ ఎం నిధుల ఊసే లేదు
- రూ.90 కోట్లు ఇవ్వాలని ఇంజనీర్ల ప్రతిపాదన
- పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- రైతుల కష్టాలు పట్టని ఎమ్మెల్యేలు

'కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం కరువు నివారణకు రూ.550 కోట్లతో గురురాఘవేంద్ర ఎత్తిపోతల ప్రాజెక్టును టీడీపీ ప్రభుత్వమే చేపట్టి పూర్తి చేసింది. ఈ జగన్ వచ్చాక కనీసం నిర్వహణకు కూడా నిధులు ఇవ్వడం లేదు. మరో 73 రోజుల్లో మన ప్రభుత్వం వస్తుంది. మరమ్మతులు చేయించే బాధ్యత టీడీపీ-జనసేన ప్రభుత్వం తీసుకుంటుంది'

- జనవరి 28న పత్తికొండలో రా కదలిరా సభలో టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు



పశ్చిమ ప్రాంత పల్లెసీమల జీవనాడి గురురాఘవేంద్ర ప్రాజెక్టు. టీడీపీ హయాంలోనే దీని నిర్మాణానికి అంకుర్పాణ జరిగింది. మళ్లీ టీడీపీ ప్రభుత్వం వచ్చాకే పూర్తి చేసి తుంగభద్ర జలాలు కరువు నేలకు ఎత్తిపోశారు. ఐదేళ్ల ఎలాంటి ఇబ్బందులు లేవు. పక్కా ప్రణాళికతో నిధులు.. నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. 2019 మేలో జగన్ ప్రభుత్వం రాగానే ఎత్తిపోతల పథకాలకు నిధుల గ్రహణం పట్టింది. ఐదేళ్లుగా ఆపరేషన్ అండ్ మెయిన్‌టెనెన్స్ (ఓ అండ్ ఎం) నిధులు ఇవ్వడం లేదు. రూ.90 కోట్లు నిధులు ఇవ్వాలంటూ గతేడాది రూ.90 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదనలు పంపితే.. నిధులు ఇవ్వకపోగా కొర్రీలు పెట్టి ఫైల్ వెనక్కి సెట్టేశారు. నిర్వహణ లేదు.. జీతాలు లేవు. వైసీపీ ఎమ్మెల్యేలకు రైతుల ఓట్లు కావాలి.. ఆ రైతుల కన్నీళ్లు తుడిచే ప్రాజెక్టు నిర్వహణ మాత్రం పట్టడదని కష్ట జీవులు విమర్శిస్తున్నారు. ఇదీ గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకం దుస్థితి.

### ● మళ్లీ చంద్రబాబు వచ్చాకే పనులు పూర్తి:

ఉమ్మడి రాష్ట్రంలో 2004 నుంచి 2014 వరకు పదేళ్ల ఆనాటి పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఈ ప్రాజెక్టు అసంపూర్తిగా ఆగిపోయింది. రాష్ట్ర విభజన తరువాత 2014లో సీఎం చంద్రబాబు బాధ్యతలు చేపట్టారు. ఆనాటి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే వీవీ జయనాగేశ్వరరెడ్డి, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి పి.తిక్కారెడ్డి చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చి నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేశారు. కరువు నేలకు తుంగభద్ర జలాలు మళ్లించారు. ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణానికి 2019లో నాటి సీఎం చంద్రబాబు రూ.1,985.42 కోట్లు మంజూరు చేసి 2019 జనవరి 20న జీవో ఆర్‌టీ నెం.76 జారీ చేశారు. అదే ఏడాది మార్చి 7న టెండర్లు ప్రక్రియ పూర్తి చేసి హైదరాబాదుకు చెందిన ఎస్‌సీసీ లిమిటెడ్ సంస్థకు సంస్థ పనులు అప్పగించి నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. జగన్ ప్రభుత్వం వచ్చాక పనులు ఆగిపోయాయి.

### ● బీవీ మోహన్‌రెడ్డి దూరదృష్టితో..:


మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాలు మీదుగా ప్రవహించే తుంగభద్ర జలాలు దశాబ్దాలుగా వృథాగా పోతున్నా కరువు నేలకు మళ్లించాలనే ఆలోచన గాని.. ఆర్డీఎస్ ఆనకట్ట నుంచి కుడి కాలువ నిర్మించాలనే ప్రతిపాదన ఉన్నప్పటికీ కాల్వ నిర్మాణం ఏ ప్రజాప్రతినిధి కూడా పట్టించుకోలేదు. ఆర్డీఎస్ కుడి కాలువ నిర్మాణానికి నిధులు ఇవ్వాలని మొట్టమొదటగా 1994లో నాటి సీఎం ఎన్టీఆర్ దృష్టికి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే, మంత్రి బీవీ మోహన్‌రెడ్డి తీసుకెళ్లారు. పరిశీలించిన ఎన్టీఆర్ 'గురురాఘవేంద్ర కాలువ'గా నామకరణం చేశారు. అయితే.. నీటి కేటాయింపు సాంకేతిక సమస్య తలెత్తడంతో జాప్యం జరిగింది. పట్టువీడని బీవీ మోహన్‌రెడ్డి చంద్రబాబు ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టాక గురురాఘవేంద్ర కాలువ కోసం ఒత్తిడి తెచ్చారు. నీటి కేటాయింపుల సమస్య తలెత్తకుండా గురురాఘవేంద్ర కాల్వ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టుగా మార్పు చేసి.. 2003లో ఆనాటి సీఎం చంద్రబాబు అదే ఏడాది ఆగస్టు 22న రూ.177 కోట్లు మంజూరు చేస్తూ జీవో ఎంఎస్ నం.132 జారీ చేశారు. ఆ తరువాత జీఆర్‌పీలో భాగంగానే ప్యాకేజీ-97, పులికనుమ, పులకుర్తి ఎత్తిపోతల పథకాలు చేపట్టారు.

### ఇంత నిర్లక్ష్యమా?

మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో రైతులు జలజీవనాడి గురురాఘవేంద్ర ఎత్తిపోతల ప్రాజెక్టులు. తుంగభద్ర నది నుంచి 3.786 టీఎంసీల నీటిని ఎత్తిపోసి 45,790 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో 2003లో ఆనాటి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేయించారు. 2003 ఆగస్టు 22న రూ.177 కోట్లు నిధులు చేస్తూ అప్పటి సీఎం చంద్రబాబు జీవో ఎంఎస్ నం.132 జారీ చేశారు. కోసిగి, మంత్రాలయం, నందవరం, ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు, కోడుమూరు, సి. బెళగల్, గూడూరు, కల్లూరు మండలాలలో ఎల్లెల్సీ చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలని మూగలదొడ్డి, పులచింత, చిలకలడోణ, సోగనూరు, కృష్ణదొడ్డి, రేమట, మునగాల, కంబదహాల్, చింతమానుపల్లె ఎత్తిపోతల పథకాలు చేపట్టారు. 2005 మార్చి 23న ప్యాకేజీ-97 కింద మాధవరం, బసలదొడ్డి, దుద్ది ఎత్తిపోతలకు రూ.65.21 కోట్లు మంజూరు చేసి జీవో ఎంఎస్ నం.52 ఇచ్చారు. ఈ పథకాలకు రూ.242.48 కోట్లు ఖర్చు చేశారు. వీటితో పాటుగా రూ.255 కోట్లు ఖర్చు చేసి పులికనుమ ప్రాజెక్టు, రూ.100 కోట్లు ఖర్చు చేసి పులచింత ఎత్తిపోతల పథకం నిర్మించారు. దాదాపుగా రూ.595 కోట్లకు పైగా ప్రజా ధనం ఖర్చు చేసి నిర్మించిన గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాల నిర్వహణను ప్రభుత్వం గాలికి వదిలేసిందని రైతులు అంటున్నారు.



బసలదొడ్డి రిజర్వాయర్



పూడికతో నిండిపోయిన బసలదొడ్డి స్టేజ్-2 పంప్‌హౌస్ అప్రోచ్ ఛానల్

### ● నిధులు లేవు.. మరమ్మతులు లేవు:

గురురాఘవేంద్ర ప్రాజెక్టులో భాగంగా స్టేజ్-1 లిఫ్టులు 7, స్టేజ్-2 లిఫ్టులు 8 కలిపి 12 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. విద్యుత్ బిల్లులు, వివిధ మరమ్మతులు, నిర్వహణ సిబ్బంది (ఆపరేటర్లు) జీతాలు కోసం ప్రభుత్వం ఆపరేషన్ అండ్ మెయిన్‌టెనెన్స్ (ఓ అండ్ ఎం) కింద 2019 వరకు గత టీడీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. వైఎస్ జగన్ సీఎం అయ్యాక ప్రాజెక్టు నిర్వహణ సిబ్బంది జీతాలు, పైపులైన్ మరమ్మతులు, తుంగభద్రనదిలో అప్రోచ్ ఛానల్‌లో జంగిల్ క్లియరెన్స్, పూడికతీత, స్టాండ్‌బై పంపుసెట్లు, విద్యుత్ ప్యానల్ బోర్డు మరమ్మతుల కోసం రూ.15 కోట్లు ఇవ్వాలని పర్యవేక్షణ ఇంజనీరు నివేదిక పంపితే.. ఒక్క పైసా ఇవ్వలేదు. ఓ అండ్ ఎం నిధులు రూ.90 కోట్లు కావాల్సి ఉందని, గత ఏడాది జూన్‌లో మరో నివేదిక పంపారు. ఆ ఫైల్‌కు కొర్రీలు పెట్టి ప్రభుత్వం వెనక్కి పంపించింది.

### ● రైతుల గోడు పట్టని ఎమ్మెల్యేలు:

మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ఇద్దరు కూడా మూడు పర్యాయాలుగా ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారు. కోడుమూడు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ గత ఎన్నికల్లో తొలిసారిగా గెలిచారు. ముగ్గురు కూడా అధికార వైసీపీ ఎమ్మెల్యేలే. గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాలు ద్వారా ఈ మూడు నియోజకవర్గాలలోని ఎల్లెల్సీ చివరి ఆయకట్టుకు సాగునీరు అందాల్సి ఉంది. రైతుల ఓట్లతోనే ఎమ్మెల్యేగా గెలిచారు ఆ రైతుల కన్నీళ్లు తుడిచే గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాల నిర్వహణ మాత్రం ఈ ఎమ్మెల్యేలకు పట్టదని, ఐదేళ్లుగా సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లి ఒక్క పైసా కూడా ఓ అండ్ ఎం నిధులు మంజూరు చేయించలేదని రైతులు ఆరోపిస్తున్నారు.


### ● ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

గురురాఘవేంద ప్రాజెక్టు పరిధిలో ఎత్తిపోతల పథకాల నిర్వహణ, మరమ్మతుల కోసం ఓ అండ్ ఎం, ఇతర మరమ్మతుల కోసం రూ.90 కోట్లు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే మరమ్మతులు చేపడుతాం. ఈ ఏడాది జీఆర్‌పీ లిఫ్టుల ద్వారా ఎల్లెల్సీ చివరి ఆయకట్టు పంటలకు సాగునీరు అందించాం.

- రాజశేఖర్, ఈఈ, గురురాఘవేంద్ర ప్రాజెక్టు

## సుప్రీం తీర్పు జగన్‌కు చెంప పెట్టు

**టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు**



**కర్నూలు(అర్బన్), జనవరి 31:** సుప్రీం తీర్పు జగన్‌కు చెంప పెట్టు లాంటిదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో ముందస్తు బెయిల్ రద్దు చేయాలని వేసిన కేసును సుప్రీంకోర్టు కొట్టివేస్తూ తీర్పును వెలువరించిందని, కోర్టు చేసిన వ్యాఖ్యలకు వైసీపీ నాయకులు సిగ్గుపడాలన్నారు. ఇంతర నిందితులకు వర్తించిన షరతులే చంద్రబాబుకు వర్తిస్తాయన్న కోర్టు తీర్పుతో వైసీపీ నేతలకు మాట రావడం లేదన్నారు. జగన్ రెడ్డి ఎన్నికుట్రలు చేసినా ప్రజల నుంచి చంద్రబాబును దూరం చేయలేరన్నారు. ఇప్పటికైనా జగన్‌రెడ్డి ఇలాంటి తప్పుడు కేసులను పెట్టడం మానుకోవాలని హితవు పలికారు. అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు దూరమైందని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కచ్చితంగా ఓటమి తప్పదని అన్నారు.

## డోలమైట్ తరలిస్తున్న లారీలు సీజ్

● పోలీస్‌స్టేషన్‌కు తరలింపు




అక్రమ ఖనిజాన్ని తలిస్తున్న లారీ

**కర్నూలు(అర్బన్), జనవరి 31:** అక్రమంగా డోలమైట్, ఖనిజాన్ని తరలిస్తున్న 2 రెండు లారీలు, 2 టిప్పర్లను సీజ్ చేశామని మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం డోన్ నుంచి హైదరాబాద్‌కు వెలుతున్న ఒక లారీని ఉల్లిందకొండ వద్ద, బెంగళూరు వెళుతున్న మరో లారీని డోన్ వద్ద సీజ్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించామని తెలిపారు. మరో రెండు టిప్పర్లు రోడ్డు మెటల్ తరలిస్తుండగా సీజ్ చేసి పెనాల్టీ విధించామని చెప్పారు. ఈ తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

# పడిపోతున్న ఉల్లి ధర

- క్వింటం గరిష్ట ధర రూ.1,161
- వేరుశనగదీ అదే పరిస్థితి
- క్వింటం రూ.7,020



**కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 31:** ఆరుగాలం శ్రమించి కాస్తో.. కూస్తో చేతికందిన పంట ఉత్పత్తులను గిట్టుబాటు ధరకు అమ్ముకుందామని ఆశిస్తున్న రైతుల పరిస్థితి మార్కెట్‌లో వ్యాపారుల మాయాజాలంతో క్షీణిస్తోంది. కర్నూలు మార్కెట్ యార్డులో గత నెల క్వింటం వేరుశనగకాయల ధర గరిష్టంగా రూ.8,500కు ఉండగా.. బుధవారం కర్నూలు మార్కెట్ యార్డులో గరిష్ట ధర రూ.7,020, మధ్యస్థ ధర రూ.6,449, కనిష్ఠ ధర రూ.3,500కు పడిపోయింది. ఉల్లిగడ్డల పరిస్థితి కూడా రోజు రోజుకూ దిగజారుతోంది. గత నెల క్వింటం ఉల్లిగడ్డలకు రూ.3వేలు పైగానే ధర ఉంటే బుధవారం గరిష్టంగా రూ.1,161, మధ్యస్థ ధర రూ.861, కనిష్ఠ ధర రూ.297 మాత్రమే రైతుల చేతికి దక్కింది. ఎండుమిరప కాయలు కూడా ధర ఆశాజనకంగా లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నెలలో క్వింటం ఎండుమిరప కాయలు గరిష్ఠ ధర రూ.25వేలకు దక్కగా, బుధవారం కేవలం గరిష్ఠ ధర రూ.19,589, మధ్యస్థ ధర రూ.17,200, కనిష్ఠ ధర కేవలం రూ.3,599లు మాత్రమే దక్కడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

# మహా శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష




సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్, ఈవో

**శ్రీశైలం, జనవరి 31:** శ్రీశైలం మహా క్షేత్రంలో మార్చి 1 నుంచి 11 వరకు మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. బుధవారం ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రెడ్డివారి చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది అంతా మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల కల్పనలో నిమగ్నమై ఉండాలన్నారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్ల గురించి సంబంధిత విభాగాధిపతులతో కూలంకషంగా చర్చించారు. తరువాత కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు మాట్లాడుతూ వైదిక సిబ్బంది, ఆలయ విభాగ అధిపతులు పరస్పర సమన్వయంతో ఉత్సవ కార్యక్రమాలు, స్వామి, అమ్మవార్ల కైంకర్యాలు సంప్రదాయబద్ధంగా జరిపించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి విభాగం కూడా రూపొందించిన ఆక్షన్ ప్లాన్‌ను అనుసరించి బ్రహ్మోత్సవాలకు ముందుగానే పనులు పూర్తి చేయాలన్నారు. క్షేత్రానికి పాదయాత్రగా తరలివచ్చే భక్తులకు అటవీ సహకారంతో అయా ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా బందోబస్తు, వసతి, వైద్య సదుపాయం, క్షేత్రపరిధిలో ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్య పనులు, సౌచాలయాలు, క్యూలైన్ల నిర్వహణ, విద్యుద్దీపాలు, సూచిక బోర్డులు, పాతాళగంగ వద్ద ఏర్పాట్లు తదితర వాటిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆయా విభాగాధిపతులను ఆదేశించారు. సమావేశంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, సహాయ కమిషనర్ వెంకటేష్, అన్ని విభాగాల అధిపతులు, పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి డీఈవోగా శ్యామేల్ పాల్

**కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 31:** కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి ఏడీ-1 శ్యామేల్ పాల్‌కు ఉద్యోగ బాధ్యతలను అప్పగించారు. ఇక్కడ డీఈవోగా పని చేస్తున్న వి.వెంకటరంగారెడ్డి బుధవారం పదవీ విరమణ పొందారు. ఖాళీ అయిన ఆయన స్థానంలో ఏడీ-1 శ్యామేల్ పాల్ నియామకమయ్యారు. త్వరలో ఫుల్ అడిషినల్ అధికారిగా నియమించే అవకాశం ఉంది.

## నంద్యాలలో డీజీపీ



డీజీపీకి స్వాగతం పలుకుతున్న పోలీస్ అధికారులు

**నంద్యాల క్రైం, జనవరి 31:** రాష్ట్ర డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం నంద్యాలకు వచ్చారు. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద కర్నూలు రేంజ్ డీఐజీ సెంధిల్‌కుమార్, కర్నూలు ఎస్పీ కృష్ణకాంత్, నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా డీజీపీకి స్వాగతం పలికారు. పోలీస్ సిబ్బంది ఆయనకు గౌరవ వందనం చేశారు. కాగా డీజీపీ వ్యక్తిగత పనులపై నంద్యాలకు వచ్చినట్లు సమాచారం.

## హంద్రీ నీవా యూనిట్-3 డిప్యూటీ కలెక్టర్‌గా మురళి

**కర్నూలు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి):** హంద్రీనీవా యూనిట్-3 డిప్యూటీ కలెక్టర్‌గా ఎ.మురళిని నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనకు పదోన్నతి కల్పిస్తూ ఈ నియామకం చేశారు. హంద్రీనీవా యూనిట్-3లో డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న ఎస్. రమను ఇక్కడి నుంచి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా హెచ్‌ఎన్‌ఎస్ఎస్ 2 వీలేరుకు బదిలీ చేశారు. అలాగే నరసరావుపేట ఆర్డీవోగా పని చేస్తున్న ఎం. శేషిరెడ్డిని కర్నూలు ఆర్డీవోగా నియమించారు. ఇక్కడ ఆర్డీవోగా పని చేస్తున్న సి. హరిప్రసాద్‌ను మదనపల్లి ఆర్డీవోగా బదిలీ చేశారు. కర్నూలు నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఎంఎల్ నరసింహను నియమించారు. అమరావతి-అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే ఒంగోలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తూ ఆయన ఇక్కడ బదిలీపై వచ్చారు.

## ఆస్పరి వద్ద విండ్ పవర్ ప్రాజెక్టు

**రాష్ట్ర కేబినేట్ నిర్ణయం**

**కర్నూలు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి):** ఆస్పరి వద్ద 200 మెగా వాట్ల విండ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు బుధవారం మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలిపారు. ఎకోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ రూ.1350 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టనుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే 200 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడలో గ్రీన్‌కో ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఏర్పాటు చేయబోయే సౌర విద్యుత్ ప్రాజెక్టుకు అవసరమైన భూములు గుర్తించారు.



# సోనాకు కష్టకాలం

- కేసీ కాలువ కింద తగ్గిన వరి సాగు
- వర్షాభావంతో తప్పని ఆరుతడి పంటలు
- ప్యాకెట్ బియ్యం రూ.3500

**పగిడ్యాల, జనవరి 31:** బియ్యమంటే కర్నూలు సోనా. విదేశాల్లో కూడా పేరున్న బియ్యం. అట్లాంటి సోనా వరికి కష్టకాలం వచ్చింది. అందరికీ తిండిపెట్టే రైతులు వరి సాగు చేయలేని పరిస్థితి ఏర్పడింది. చివరికి రైతులకే బియ్యం కరువయ్యాయి. ప్రతి ఏటా కేసీ కాలువ కింద పెద్ద ఎత్తున కర్నూలు సోన రకం వరి పంటను రైతులు సాగు చేసేవారు. పంట దిగుబడిలో ఇంటి అవసరాలకు ఉంచుకొని మిగిలిన ధాన్యాన్ని విక్రయించుకునేవారు. అయితే ఆ ఏడాది వర్షాభావం వల్ల జలాశయాలకు వరద నీరు సక్రమంగా అందలేదు. దీంతో వరి సాగు బాగా తగ్గిపోయింది. కేసీ కాలువ అధికారులు నీటి విడుదలపై రైతులకు స్పష్టమైన హామీ ఇవ్వలేదు. కాలువ కింద ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. దీంతో ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న, మినుము, జొన్న తదితర పంటలు సాగు చేసుకోవాల్సి వచ్చింది. మండల పరిధిలోని పగిడ్యాల, పాలమర్రి, సంకిరేణిపల్లె, ముచ్చుమర్రి, నెహ్రూనగర్, ప్రాతకోట, ఘణపురం గ్రామాల్లో కేసీ కాలువ కింద మొక్కజొన్న 325 హెక్టార్లు, మినుము 2216 హెక్టార్లలో, జొన్న, వేరుశనగ పంటలు సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. దీనికితోడు పంటలు తెగుళ్ల బారిన పడటంతో దిగుబడి తగ్గిపోయిందని రైతులు తెలిపారు.



కేసీ కింద సాగైన పంట

### మొదటిసారి బియ్యం కొంటున్నాం



కేసీ కాలువకు నీటి విడుదల విషయంలో అధికారులు స్పష్టమైన ప్రకటన చేయలేదు. దీంతో వరి సాగు దెబ్బతినిపోయింది. చివరికి ఇంట్లో అవసరాలకు కూడా బియ్యం కొనాల్సి వస్తోంది. ఏటా కేసీ కాలువ కింద 15 ఎకరాలలో వరి పంటను సాగు చేసేవాడ్ని. ఈ ఏడాది ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని అధికారులు అన్నారు. దీంతో 15 ఎకరాలలో మినుము, మొక్కజొన్న, వేరుశనగ, జొన్న పంటలు సాగు చేశాం. కుటుంబ అవసరాలకు 30 ప్యాకెట్ల బియ్యం కొన్నాను.

- ధర్మక్షేత్ర, రైతు, పగిడ్యాల

### 50 కేజీల బియ్యం ప్యాకెట్ రూ.3500



వర్షాభావ పరిస్థితుల కారణంగా కేసీ కాలువ కింద రైతులు మొక్కజొన్న, మినుము పంటలను సాగు చేయడంతో వరి పంటల సాగు తగ్గిపోయింది. దీంతో మార్కెట్‌లో సోనా బియ్యం ధరలు పెరిగాయి. 50 కేజీల ప్యాకెట్ రూ. 3200-3500 పలుకుతోంది. అక్కడక్కడ వరి సాగు చేసిన రైతులు నూర్పిడి చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించి బియ్యం విక్రయిస్తున్నారు. గతంలో కేసీ కాలువ కింద రైతుల వరి పంటలను సాగు చేయడం వలన ప్రతి ఇంట్లో బియ్యం ఉండేవి. ఈ ఏడాది ఆరుతడి పంటలు సాగు చేయడం వలన రైతులకు తినడానికి కూడా బియ్యం లేక అంగట్లో కొనుక్కోవాల్సి వస్తోంది. . గతంలో ఎప్పుడూ ఇట్లా బియ్యం కొని తినాల్సిన పరిస్థితి రాలేదని రైతులు అంటున్నారు. కేసీ కాలువకు నవంబరు చివరి వరకు నీరు విడుదల చేస్తామని చెప్పిన కేసీ కాలువ అధికారులు, ప్రజాప్రతినిధులు తమకు ఇబ్బందులకు గురి చేశారని రైతులు మండిపడుతున్నారు.

## అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**కర్నూలు(హాస్పిటల్), జనవరి 31:** ఐసీడీఎస్ కర్నూలు జిల్లా పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, మినీ టీచర్ల, ఆయా పోస్టులకు అర్హులైన స్త్రీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సాధికారిత అధికారి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి. వెంకటలక్ష్మమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలు 11, మినీ టీచర్ 1, ఆయా పోస్టులు 84 ఖాళీగా ఉన్నాయన్నారు. అంగన్‌వాడీ టీచర్ల పోస్టుకు 10వ తరగతి పాసై ఉండాలని, ఆయా పోస్టుకు 7వ తరగతి పాసై ఉండాలన్నారు. 1.7.2023 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. పెళ్లయి అదే గ్రామంలో నివసిస్తూ ఉండాలని అన్నారు. దరఖాస్తులను సీడీపీవో కార్యాలయంలో ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలన్నారు.

## ఏపీఎస్పీ రెండో బెటాలియన్ కమాండెంట్ బదిలీ

**కర్నూలు, జనవరి 31:** ఏపీఎస్పీ రెండో బెటాలియన్ కమాండెంట్ రవిశంకర్‌ను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఏపీఎస్పీ 11వ బెటాలియన్ (కడప)కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో 11వ బెటాలియన్ కమాండెంట్‌గా ఉన్న శ్రీనివాసరావును నియమించింది. అలాగే 11వ బెటాలియన్ అడిషినల్ కమాండెంట్‌గా ఉన్న ప్రభుకుమార్‌ను ఏపీఎస్పీ రెండో బెటాలియన్ అడిషినల్ కమాండెంట్‌గా నియమించింది.

● సెబ్ అడిషనల్ ఎస్పీకి పోస్టింగ్ మార్పు: కర్నూలు సెబ్ అడిషినల్ ఎస్పీ కృష్ణకాంత్ పాటిల్ పోస్టింగ్‌ను మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన గతంలో కాకినాడ బెటాలియన్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం విజయవాడ లా అండ్ ఆర్డర్ డీసీబీగా బదిలీ చేసింది.

## ఆర్ఐలకు స్థానచలనం

**కర్నూలు, జనవరి 31:** రిజర్వుడు ఇన్‌స్పెక్టర్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలులో ఉన్న పోతల రాజును తిరుపతికి, రవికుమార్‌ను సత్యసాయి జిల్లాకు, రమణ, శివారెడ్డిలను తిరుపతికి, సుదాకర్‌ను చిత్తూరుకు బదిలీ చేసింది. అలాగే సత్యసాయి జిల్లాలో ఉన్న నారాయణను కర్నూలుకు, రాజశేఖర్ రెడ్డిని తిరుపతికి, కడపలో ఉన్న సోమ శేఖర్ నాయక్‌ను కర్నూలుకు అన్నమయ్య జిల్లాలో ఉన్న జావీదును, చిత్తూరులో ఉన్న మధును కర్నూలుకు బదిలీ చేసింది. తిరుపతిలో ఉన్న నాగభూషణను నంద్యాలకు బదిలీ చేసింది.

## శాశ్వత లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

- జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్.శ్రీనివాసరావు




అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్.శ్రీనివాసరావు

**కర్నూలు(లీగల్), జనవరి 31:** ప్రజా వినియోగ సేవా రంగాల ద్వారా నష్టపోయిన బాధితులకు శాశ్వత లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం అందుతుందని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక లోక్ అదాలత్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఒక అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రవాణా, పోస్టల్, విద్యుత్, మున్సిపాలిటీ, బీమా, బ్యాంకింగ్ తదితర రంగాల ద్వారా నష్టపోయిన బాధితులు శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించాలని ఆయన కోరారు. బాధితులకు ఎటువంటి కోర్టు ఫీజులు లేకుండా సత్వర న్యాయాన్ని శాశ్వత లోక్ అదాలత్ అందజేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు, శాశ్వత లోక్‌అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకటహరినాథ్ పాల్గొన్నారు.

## తహసీల్దార్లకు స్థానచలనం

**కర్నూలు(కలెక్టరేట్), జనవరి 31:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కర్నూలు జిల్లా వ్యాప్తంగా పలువురు తహసీల్దార్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ స్పెషల్ సీఎస్ చీఫ్ కమిషనర్ జి.సాయిప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లా నుంచి 13 మంది, చిత్తూరు నుంచి 9 మంది, కడప నుంచి ముగ్గురు కర్నూలుకు బదిలీ అయ్యారు. కర్నూలు నుంచి కడపకు 10 మంది, అనంతపురానికి 11 మంది, చిత్తూరు జిల్లాకు ఐదుగురు బదిలీ అయ్యారు. బదిలీ అయిన తహసీల్దార్ల వివరాలు ఇలా...

| పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ స్థానం |
|---|---|---|
| శ్రీధర్ మూర్తి | అనంతపురం | కర్నూలు |
| షర్మిళ | అనంతపురం | కర్నూలు |
| శేషారెడ్డి | అనంతపురం | కర్నూలు |
| మునివేలు | అనంతపురం | కర్నూలు |
| మోహన్ కుమార్ | అనంతపురం | కర్నూలు |
| ఈరమ్మ | అనంతపురం | కర్నూలు |
| ఓబులేసు | అనంతపురం | కర్నూలు |
| రజాక్‌వలి | అనంతపురం | కర్నూలు |
| ఈశ్వరయ్యశెట్టి | అనంతపురం | కర్నూలు |
| అనుపమ | అనంతపురం | కర్నూలు |
| నటరాజు | అనంతపురం | కర్నూలు |
| అనంతాచారి | అనంతపురం | కర్నూలు |
| హసీనా సుల్తానా | అనంతపురం | కర్నూలు |
| శేఖర్ | చిత్తూరు | కర్నూలు |
| వసుదేవన్ | చిత్తూరు | కర్నూలు |
| బేలయ్య | చిత్తూరు | కర్నూలు |
| మాధవరాజ్ | చిత్తూరు | కర్నూలు |
| చంద్రశేఖర్ | చిత్తూరు | కర్నూలు |
| పార్వతి | చిత్తూరు | కర్నూలు |
| గుర్రప్ప | చిత్తూరు | కర్నూలు |
| ఉదయ్ సంతోష్ | చిత్తూరు | కర్నూలు |
| ఝాన్సీ లక్ష్మి | చిత్తూరు | కర్నూలు |
| శేషయ్య | కడప | కర్నూలు |
| నిర్మలాదేవి | కడప | కర్నూలు |
| అనురాధ | కడప | కర్నూలు |
| శివరాముడు | కర్నూలు | కడప |
| జయన్న | కర్నూలు | కడప |
| రాజేశ్వరి | కర్నూలు | కడప |
| విజయశ్రీ | కర్నూలు | కడప |
| వెంకటేశ్ నాయక్ | కర్నూలు | కడప |
| గోవింద్ సింగ్ | కర్నూలు | కడప |
| వెంకటరమణ | కర్నూలు | కడప |
| వెంకటలక్ష్మి | కర్నూలు | కడప |
| రమేష్‌బాబు | కర్నూలు | కడప |
| నిత్యానంద | కర్నూలు | కడప |
| శేషఫణి | కర్నూలు | అనంతపురం |
| కుమారస్వామి | కర్నూలు | అనంతపురం |
| మల్లికార్జునస్వామి | కర్నూలు | అనంతపురం |
| నజీమా బాను | కర్నూలు | అనంతపురం |
| వేణుగోపాల్ | కర్నూలు | అనంతపురం |
| సతీష్ | కర్నూలు | అనంతపురం |
| ఆంజనేయులు | కర్నూలు | అనంతపురం |
| శ్రీనాథ్ | కర్నూలు | అనంతపురం |
| వసుంధర | కర్నూలు | అనంతపురం |
| శివప్రసాద్ రెడ్డి | కర్నూలు | అనంతపురం |
| శివశంకర్ నాయక్ | కర్నూలు | అనంతపురం |
| వేణుగోపాల్‌రావు | కర్నూలు | చిత్తూరు |
| రవి | కర్నూలు | చిత్తూరు |
| చంద్రశేకర్ | కర్నూలు | చిత్తూరు |
| రామాంజనేయులు | కర్నూలు | చిత్తూరు |
| హుశేన్‌సాహేబ్ | కర్నూలు | చిత్తూరు |

## పశుసంవర్ధక శాఖలో బదిలీలకు కసరత్తు

**కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 31:** ఎన్నికల కోడ్ రానుండటంతో పశుసంవర్ధక శాఖలో బదిలీలకు అధికారులు కసరత్తు పూర్తి చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మూడు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న వారికి బదిలీ ప్రక్రియను నిర్వహించేందుకు పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా పశుసంవర్ధక శాఖలో పని చేస్తున్న ఏహెచ్‌ఏ సిబ్బంది బదిలీలను బుధవారం చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో 130 మంది ఏహెచ్‌ఏలు పని చేస్తుండగా.. అందులో 88 మంది బదిలీలకు దరఖాస్తు చేసుకున్నట్లు జేడీ రామచంద్రయ్య తెలిపారు.

## ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌కు వినియోగదారుల కమిషన్ వడ్డింపు



**కర్నూలు(లీగల్), జనవరి 31:** మృతి చెందిన ఇద్దరు పాలసీదారుల నామినీలకు బీమా మొత్తం చెల్లించకుండా సేవా లోపం చేసిన ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలకు జిల్లా వినియోగదారుల కమిషన్ తగిన రీతిలో వడ్డించింది. నందికొట్కూరు చెందిన పి.మధుకుమార్ 2021లో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి రూ.50లక్షల పాలసీని తీసుకున్నాడు. పాలసీ ఇచ్చే ముందు కంపెనీ అధికారులు ఫిర్యాదిని అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించారు. ఆ తర్వాత 2022 ఏప్రిల్‌లో అతను గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో పాలసీలో నామినీ అయిన మృతుని భార్య పి.శైలజ పాలసీ మొత్తం కోసం ఇన్సూరెన్స్ కంపెనీకి దరఖాస్తు చేసుకుంది. అయితే.. మృతుడు గతంలో తీసుకున్న గుండె చికిత్స వివరాలను కంపెనీకి తెలియపరచకుండా తీసుకున్నాడని ఆమె దరఖాస్తును తిరస్కరించింది. దీంతో మృతుని భార్య జిల్లా వినియోగదారుల కమిషన్‌లో కేసు దాఖలు చేసింది. మరొక కేసులో స్థానిక రోజావీధికి చెందిన బి.కాశిరెడ్డి 2020లో అదే ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి రూ.50 లక్షల పాలసీని చేయించుకుని 2022లో గుండెపోటుతో మృతి చెందాడు. మృతుని భార్య సుబ్బలక్ష్మమ్మ పాలసీ మొత్తం కోసం చేసుకున్న క్లెయిమ్‌ను కూడా తిరస్కరించింది. దీంతో ఈమె కూడా కేసు దాఖలు చేసింది. రెండు కేసులను విచారించిన వినియోగదారుల కమిషన్ ఫిర్యాదిదారుల క్లెయిమ్‌ను తిరస్కరించడం సేవాలోపం అవుతుందని విచారించింది. దీంతో ఫిర్యాదిదారులకు క్లెయిమ్‌ల మొత్తాలతో పాటు కోర్టు ఖర్చుల కింద అదనంగా మరో రూ.60ల చొప్పున చెల్లించాలని ఆదేశిస్తూ కమిషన్ అధ్యక్షుడు కరణం కిషోర్ కుమార్, సభ్యులు ఎన్.నారాయణ రెడ్డి, నజీమా కౌసర్‌లు ఆదేశాలు జారీ చేశారు.

## మంత్రాలయం అభివృద్ధికి పీఠాధిపతి కృషి

- మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు



**మంత్రాలయం, జనవరి 30:** మంత్రాలయం పట్టణంతో పాటు మఠం అభివృద్ధికి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఎనలేని కృషి చేస్తున్నారని మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రాలయంతో పాటు శ్రీమఠాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ప్రభుత్వం ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో ఉన్న ప్రభుత్వ భవనంతో పాటు స్థలాన్ని బదలాయింపుతో పాటు రిజిస్ట్రేషన్ చేసుకున్నామని వెల్లడించారు. మంత్రాలయంలోని ప్రభుత్వ కార్యాలయాలైన పోలీస్‌స్టేషన్, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయం, కళాశాల, సీఆర్వో ఆఫీసు తదితర కార్యాలయాలకు సంబంధించిన భూములు శ్రీమఠానికి చెందినవి కావడంతో ఖాళీ చేయాలని రెండుసార్లు నోటీసులు ఇచ్చామన్నారు. ఆయా కార్యాలయాల అధికారులు భవనాలు నిర్మించదలిస్తే పీఠాధిపతి ఆదేశాల మేరకు స్థలాలను కేటాయిస్తామన్నారు. వేసవి సీజన్‌లో మంత్రాలయం పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నిర్మిస్తామన్నారు.

## కబ్జాపై ప్రశ్నించినందుకు దాడి

- రాళ్లు, కర్రలతో కొట్టిన వైసీపీ నాయకుడు
- గణేష్‌కు తీవ్ర గాయాలు

**హొళగుంద, జనవరి 31:** పొలం కబ్జా చేసిందే కాకుండా బాధితుడిని ఓ వైసీపీ నాయకుడి కుటుంబం రాళ్లు, కర్రలతో చితకబాదింది. బాధితుడి వివరాల మేరకు.. మండలంలోని ముద్దటమాగి గ్రామానికి చెందిన భీమన్నకు సర్వే నెం.109ఎఫ్‌లో నాలుగు ఎకరాల భూమి ఉంది. అందులో ఆయన కుమారులైన గణేష్‌కు మూడు ఎకరాలు, శీనుకు 0.50 సెంట్లు, పొంపకు 0.50 సెంట్లు భూమి రాసి ఇచ్చాడు. ఈ భూమిని 30 ఏళ్లుగా వారే సాగు చేసుకుంటున్నారు. వీరి పొలానికి ఆనుకొని అదే గ్రామానికి చెందిన కృష్ణారెడ్డికి భూమి ఉంది. అయితే అతను గణేష్ పొలంలో 50 సెంట్లకు పైగా కబ్జా చేసి అందులో కంది పంటను వేసుకున్నాడు. ఈ విషయంపై పలుమార్లు తహసీల్దారు, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎవరు పట్టించుకోలేదు. దీంతో తన పొలంలో అక్రమంగా వేసిన కంది పంటను కొంతమేరకు తొలగించి తన స్నేహితులతో ఇంటికి ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలో వైసీపీ నాయకుడు గాదిలింగ అతడి అన్న వెంకటేష్‌తో పాటు మరో 8మంది రాళ్ల కర్రలతో దాడి చేసి గాయపరిచారు. ఈ దాడిలో గణేష్‌కు కన్ను, వీపు, కడుపుపై గాయాలయ్యాయి. అధికారం ఉందని ఇలా దౌర్జన్యం చేయడం ఏమిటని, దాడికి పాల్పడిన ఆ వైసీపీ నాయకుడితోపాటు అతని అనుచరులపై కేసు నమోదు చేయాలని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ విషయంపై ఎస్సై పెద్దయ్య నాయుడుని వివరణ కోరగా ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేశారని, విచారణ చేపట్టి తప్పు చేసిన వారిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు.



హొళగుందలో మాట్లాడుతున్న బాధితుడు



వీపుపై గాయాలను చూపుతున్న బాధితుడు

## వాహన చట్టాలపై అవగాహన అవసరం

**కర్నూలు(కలెక్టరేట్), జనవరి 31:** వాహనాదారులకు చట్టాలపై అవగాహన అవసరమని కలెక్టర్ జి.సృజన అన్నారు. బుధవారం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా కలెక్టరేట్ నుంచి సీ.క్యాంపు సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జనవరి 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 19 వరకు జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను నిర్వహిస్తుందన్నారు. యువత 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే డ్రైవింగ్ లైసెన్స్ పొందాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీఓ రమేష్, ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

## నేడు ఓరియంటేషన్ ప్రోగ్రాం

**కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 31:** జిల్లాలోని అన్నీ యాజమాన్యాల జూనియర్ కాలేజీల్లో పని చేస్తున్న సైన్స్ లెక్చరర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు గురువారం కర్నూలు ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో ఒక రోజు ఓరియంటేషన్ ప్రోగ్రాంను ఏర్పాటు చేసినట్లు ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్య శెట్టి బుధవారం తెలిపారు. విధిగా సైన్స్ లెక్చరర్లు, కంప్యూటర్ ఆపరేటర్లను సమావేశానికి పంపాలని కళాశాలల ప్రిన్సిపాల్స్ యజమాన్యాలకు ఆయన చెప్పారు.

## మహిళ ఆత్మహత్య

**హొళగుంద, జనవరి 31 :** మండలంలోని నెరణికి గ్రామానికి చెందిన భారతి (27) ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన బుధవారం జరిగింది. భారతి మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకున్నది. చుట్టుపక్కల వారు గమనించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతిరాలికి భర్త రాజశేఖర్, ఇద్దరు అబ్బాయిలు, ఒక కూతురు ఉన్నారు. భారతి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్టు

**కర్నూలు, జనవరి 31:** నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ శంకరయ్య, ఎస్ఐ మోహన్ కిషోర్ రెడ్డిల ఆధ్వర్యంలో నిందితులు పిల్లి బద్రి అలియాస్ మహేష్ (పొద్దుటూరు), కావలి నరసింహులు (రంగారెడ్డి జిల్లా)లను అరెస్టు చేశారు. నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఐదు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కర్నూలు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు బైకులను, తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక బైకును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

## యువతి ఆత్మహత్య

**హాలహర్వి, జనవరి 31 :** మండలంలోని విరుపాపురం గ్రామంలో ఓ యువతి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పెళ్లి సంబంధాలన్నీ వెనక్కి పోతున్నాయనే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ నరేంద్ర తెలిపారు.





## అప్రెంటిస్‌షిప్ విధానాన్ని రద్దు చేయాలి




దీక్షనుద్దేశించి మాట్లాడుతున్న సురేష్ కుమార్

**కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 31:** డీఎస్సీలో అప్రెంటిస్‌షిప్ విధానాన్ని రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కే.సురేష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు రవికుమార్ డిమాండ్ చేశారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ధర్నా చౌకు వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన బకాయిలు, పీఆర్సీని చెల్లించాలని రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్రెంటిస్‌షిప్ విధానాన్ని వైసీపీ ప్రభుత్వం డీఎస్సీలో పునరుద్ధరించడం సిగ్గుచేటని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన పీఎఫ్, ఏపీజీఎల్ఐసీ, ఈఎల్ఎస్ రుణాలను విడుదల చేయాలని కోరారు. ఉపాధ్యాయ నియామకాల్లో అప్రెంటిస్‌షిప్ విధానానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం సిగ్గుచేటని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరెకృష్ణ, కార్యదర్శి గట్టు తిమ్మప్ప అన్నారు. డీఎస్సీలో అప్రెంటిస్‌షిప్ విధానాన్ని రద్దు చేయాలని ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు కేజీఎస్ గణపతిరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రావు డిమాండ్ చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ అప్రెంటిస్‌షిప్ విధానాన్ని ప్రవేశ పెట్టడాన్ని ఏపీటీఎఫ్ వ్యతిరేకిస్తుందని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇస్మాయిల్, మరియానందం తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటిల్, సహాధ్యక్షులు హేమంత్, ఆర్థిక కార్యదర్శి యేసన్న, గౌరవాధ్యక్షులు దావీదు, నాగమణి, ఎలప్ప, జయరాజు, జిల్లా కార్యదర్శులు తిమ్మన్న, నరసింహులు పాల్గొన్నారు.

## ఉద్యోగావకాశాలపై అవగాహన

**కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 31:** స్థానిక బీక్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో డీఆర్‌డీఏ, సీడాక్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ ప్లేస్‌మెంటు ఆఫీసర్ బి.కృష్ణ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలపై ఉచిత శిక్షణ డీఆ రడీఏ ద్వారా పొందవచ్చునని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, జాబ్స్ కోఆర్డినేటర్ ఖాజాబాషా, హర్యామన్ టెక్నాలజీస్ శిక్షణ సంస్థ నిర్వాహ కుడు మహబూబ్‌బాషా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి

**కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 31:** పదవీ విరమణ పొందిన ఉపాధ్యా యుడు శంకర్ రెడ్డికి 40 నెలలు గడుస్తున్నా పెన్షన్ బెనిఫిట్స్ అందకుండా చేసిన దేవనకొండ ఎంఈవో, డీఈవో రంగారెడ్డిపై చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల కమిషన్ అధికారులకు బహుజన టీచర్స్ ఫెడరేషన్ వ్యవ స్థాపక అధ్యక్షుడు కె.సతీష్ కుమార్, బాధిత విశ్రాంత ఉపాధ్యాయుడు శంకర్ రెడ్డి బుధవారం ఫిర్యాదు చేశారు. తక్షణమే శంకర్ రెడ్డికి జీతాలు, ఆరియర్స్, పెన్షన్ బెనిఫిట్స్ మంజూరు చేయాలన్నారు.

## నవరత్నాల పేరిట మోసం



పోస్టర్లను విడుదల చేస్తున్న టీడీపీ నాయకులు

**గూడూరు, జనవరి 31:** జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాల పేరిట ప్రజలను మోసం చేశారని టీడీపీ కోడుమూరు ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్ ఆరోపించారు. బుధవారం గూడూరులో పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు ఆధ్వర్యంలో తెలుగుదేశం పిలు స్తోంది రా కదలి రా.. రాష్ట్ర భవిష్యత్ తీర్చిదిద్దే అత్యుత్తమ ప్రణాళిక బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ పోస్టర్లను ఆకెపోగు ప్రభాకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆకెపోగు మాట్లాడుతూ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నార న్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎల్ సుధాకర్ రెడ్డి, టీడీపీ అధికార ప్రతినిధి దండు సుందరరాజు, మైనార్టీ కార్యదర్శి మన్సూన్ బాషా, మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్‌బాబు, శాంతరాజు, చిలక శ్రీను, మహేష్, చందు, గిడ్డయ్య పాల్గొన్నారు.

## పాలకొలను మాజీ సర్పంచ్ మృతి

**ఓర్వకల్లు, జనవరి 31:** మండలంలోని పాలకొలను గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ కత్తి రాముడు (80) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు చదువుల సుధాకర్ రెడ్డి, చింతలపల్లె సర్పంచ్ వెంటరమణ, ఉప్పలపాడు మాజీ సర్పంచ్ రంగస్వామి ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ కత్తి రాముడు మృతి టీడీపీకి తీరని లోటని, సర్పంచుగా గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. గ్రామంలో కత్తి రాముడు అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు గ్రామస్థులు, టీడీపీ కార్యకర్తలు తరలివచ్చారు.

## ముడుమాలలో పల్లె నిద్ర

**సి.బెళగల్, జనవరి 31:** మండలంలోని ముడుమాల గ్రామంలో బుధవారం కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్, స్థానిక ఎస్ఐ మన్మధవిజయ్ పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. కోడుమూరు సీఐ మన్సురుద్దీన్ గ్రామస్థులతో మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ప్రజలంతా సోదరభావంతో కలిసి మెలసి జీవించాలన్నారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈసమావేశంలో హెడ్ కానిస్టేబుల్, పోలీసులు, సర్పంచ్ బతుకమ్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పోలీసు డైరీ ఆవిష్కరణ

**కర్నూలు, జనవరి 31:** పోలీస్ డైరీ-2024ను ఎస్పీ జి.కృష్ణకాంత్ బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులకు సంబంధించిన సమగ్ర సమాచారం ఉన్న ఈ డైరీ పోలీసుల రోజు వారి కార్యకలాపాలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ నాగరాజు, స్పెషల్ బ్రాంచ్ సీఐలు నాగరాజు యాదవ్, శ్రీనివాసరెడ్డి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

**సి.బెళగల్, జనవరి 31:** పంచాయతీలలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో సందీప్ సర్పంచులకు ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో సర్పంచులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో సందీప్ మాట్లాడుతూ మండలంలోని తిమ్మనదొడ్డి, సంగాల, గుండ్రేవుల, చింతమానుపల్లె, కొండాపురం తదితర గ్రామాల్లో తాగునీటి ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలని, బోర్లకు మర్మమతులు చేపట్టాలని ఆదేశించారు.

## అనుమతి లేకుండా విద్యుత్ వినియోగించుకోరాదు

**సి.బెళగల్, జనవరి 31:** అధికారుల అనుమతి లేకుండా విద్యుత్ విని యోగిస్తే చర్యలు తప్పవని ఏడీ జాన్ రైతులను హెచ్చరించారు. బుధవారం మండలంలోని బురాన్‌దొడ్డి, గొల్లలదొడ్డి గ్రామాల్లోని రైతులతో ఏడీ సమావేశమయ్యారు. విద్యుత్ ఏఈ సుకుమార్, లైన్ మెన్‌లు పాల్గొన్నారు.

# దారి మళ్లిన చేపల మార్కెట్ నిధులు

### ప్రభుత్వ నిర్వాకంపై మత్స్యకారుల ఆగ్రహం



కింగ్ మార్కెట్‌లో కొనసాగుతున్న చేపల మార్కెట్

**కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 31:** కర్నూలు నగరంలో మత్స్యకారులకు ఆధునిక సౌకర్యాలతో చేపల మార్కెట్‌ను ఏర్పాటు చేయడానికి గత తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన అనుమతిని ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం గాలిలో కలిపేసిందనే వార్తలు గుప్పుమంటున్నాయి. ఈ చేపల మార్కెట్ ఏర్పాటు కోసం కేటాయించిన రూ.5 కోట్ల నిధులను కూడా ప్రభుత్వం వెనక్కి తీసుకున్నట్లు మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు సీ. క్యాంపు రైతు బజారును విస్తరించే కార్యక్రమంలో భాగంగా శిథిలమైన రెవెన్యూ క్వార్టర్స్‌ను మార్కెటింగ్ శాఖ తన ఆధీనంలోకి తీసుకుని ఈ చేపల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని గత టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం కింగ్ మార్కెట్‌లో చేపలను కొనేందుకు వెళ్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురికి నీరు, ఇరుకు స్థలంతో పది మంది కూడా ఆ మార్కెట్‌లో ఉండలేక పోతున్నారు. అప్పట్లో మత్స్యకారుల విజ్ఞప్తి మేరకు ఆధునిక సౌకర్యాలతో చేపల మార్కెట్‌ను ఏర్పాటు చేసేందుకు రూ.5 కోట్లను వెంటనే విడుదల చేశారు. వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన మోపిదేవి వెంకటరమణ ఈ చేపల మార్కెట్ శంకుస్థాపనకు వచ్చారు. అయితే అప్పటి వైసీపీ నాయకుల మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తడంతో ఈ కార్యక్రమాన్ని మధ్యలోనే వదిలేసి మంత్రి వెనక్కి వెళ్లిపోయారు. ఆ తర్వాత ఈ చేపల మార్కెట్ ఏర్పాటు గురించి పట్టుకున్న నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా ప్రభుత్వం చేపల మార్కెట్‌ను ఏర్పాటు చేసి తమ జీవనోపాధిని మెరుగుపరచాలని మత్స్యకారులు కోరుతున్నారు.

**మత్స్యకారుల జీవనోపాధికి గండికొట్టారు**



కర్నూలు నగరంలో అధునాతనమైన చేపల మార్కెట్‌ను ఏర్పాటు చేసేందుకు గత తెలుగుదేశం ప్రభుత్వం రూ.5కో ట్లను మంజూరు చేసింది. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఆ నిధులను దారి మళ్లించింది. చేపల మార్కెట్ ఏర్పాటు చేయకపోతే ఆందోళనలు చేపడుతాం.

- పీజీ వెంకటేష్, మత్స్యకారుల సంఘం రాయలసీమ ప్రతినిధి

# వైసీపీని గద్దె దించుదాం: గౌరు చరిత



31వ వార్డు ప్రజలతో మాట్లాడుతున్న గౌరు చరిత

**కల్లూరు, జనవరి 31:** రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించుదామని టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 31వ వార్డు శరీన్‌నగర్‌లో చేపట్టిన రచ్చబండ, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీలో ఇంటింటికీ తిరిగి ప్రజలు సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ వైసీపీ పాలనలో అవినీతి అక్రమాలు, దోపిడీ తప్ప అభివృద్ధి ఎక్కడా జరగలేదని ఆరోపించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి శైలజయాదవ్, మాజీ ఎంపీపీ వాకిటి మాధవి, కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్ యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, మాదేష్, వంగాల జనార్దన్‌రెడ్డి, ఆదం, మల్లికార్జున, రామకృష్ణ. క్రిష్ణన్న, సువర్ణ, రేణుక, జనసేన నాయకులు షబ్బీర్, తిరుమలేష్, సునీల్ పాల్గొన్నారు.

● **ఉచిత వైద్యశిబిరంలో పాల్గొన్న గౌరు చరిత:** కల్లూరు మండలం చెట్లమల్లాపురం టీడీపీ నాయకుడు తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత వైద్య శిబిరానికి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత హాజరై ప్రారంభించారు. బుధవారం కిమ్స్ డాక్టర్లు ప్రజలకు గుండె జబ్బులకు చికిత్స అందించారు. కార్యక్రమంలో ఉలిందకొండ టీడీపీ నాయకుడు ఈవీ రమణ, కాసాని మహేష్‌గౌడ్, గంగాధర్‌గౌడ్, మాదేష్, ధనుంజయ, ఈవీ శ్రీకాంత్, కలాం, శీను, సోమేశ్వరయ్య, వీరేష్ పాల్గొన్నారు.

**కర్నూలు(రూరల్):** తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు బొగ్గుల దస్తగిరి అన్నారు. బుధవారం కర్నూలు మండలం వెంకాయపల్లె, మిలిటరీ కాలనీలో చేపట్టిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం టీడీపీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా టీడీపీ నాయకుడు బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంతో జరిగిన అభివృద్ధి తప్ప వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో కైలాష్‌నాయక్, నజీర్, ప్రభుదాస్, చక్రవర్తి, వెంకటేష్, అభిలాష్, సూరి, జయన్న, జయరాజు, జాన్ పాల్గొన్నారు.



బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకుడు బొగ్గుల దస్తగిరి

# టీడీపీకి ఆదరణ

### టీజీ భరత్ సమక్షంలో 22వ వార్డు మహిళలు పార్టీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో టీజీ భరత్

**కర్నూలు(అర్బన్), జనవరి 31:** ప్రజల్లో రోజు రోజుకు టీడీపీకి ఆదరణ పెరుగుతోందని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. బుధవారం మౌర్యఇన్‌లో 22వ వార్డులోని ఆరోరనగర్, బీ. క్యాంప్‌కు చెందిన మహిళలు టీజీ భరత్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీకి మద్దతు తెలిపేందుకు మహిళలు తరలిరావడం సంతోషంగా ఉందన్నారు. ఈ ఐదేళ్లలో ప్రజల ఆదాయం ఏ మాత్రం పెరగలేదని, పెరిగిన ధరలు, పన్నుల భారంతో అన్ని ఖర్చులు పెరిగిపోయాయన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గ్రహించి టీడీపీ, జనసేన ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి శ్రీధర్, బూత్ ఇన్‌చార్జిలు చంద్రశేఖర్, సూర్యప్రకాష్, దీపిక, గీత, ఈశ్వర్, వంశీ, విష్ణు, షణ్ముక, చైతన్య, వనిత, గోపాలక్రిష్ణ, రంగనాథ్, సాయి, పుష్పవల్లి, లలిత పాల్గొన్నారు.

**నమ్మకంగా పని చేయాలి:** కొత్తగా ఉద్యోగాలు పొందిన వారు తమ విధుల్లో నమ్మకంగా పని చేయాలని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. బుధవారం కర్నూలు నగరంలోని మౌర్యాఇన్‌లో ఇటీవల జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందిన యువతీ, యువకులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24న నిర్వహించిన జాబ్ మేళాలో దాదాపు 400 మంది ఉద్యోగాలకు ఎంపికవ్వడం సంతోషించదగ్గ విషయమన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి ఒక గుర్తింపు సంపాదించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శివప్రసాద్, జనార్దన్, ఈశ్వర్, మంజునాథ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## ఎంఎల్‌టీ అప్రెంటిస్‌షిప్‌కు వసూళ్లు ?

**కర్నూలు(హాస్పిటల్), జనవరి 31:** మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎంఎల్‌టీ) కోర్సు పూర్తి చేసిన ప్రైవేటు విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్ తప్పనిసరి. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో అప్రెంటిషిప్ పూర్తి చేసిన ప్రైవేటు విద్యార్థులకు సర్టిఫికెట్ ఇవ్వడానికి సూపరింటెండెంట్ కార్యాలయంలో ఓ క్లర్క్ దందా సాగిస్తున్నారు. బుధవారం అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్ కోసం ప్రైవేటు కాలేజీ విద్యార్థులు 40 మంది ఉదయం 10 గంటలకే కార్యాలయానికి చేరుకున్నారు. సర్టిఫికెట్ ఇవ్వడానికి కొందరి విద్యార్థుల నుంచి ఒక్కొక్కరి దగ్గర రూ.300 వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కొందరు విద్యార్థులు ఫోన్ పే ద్వారా డబ్బులు వేయగా మరికొందరు మధ్యవర్తుల ద్వారా డబ్బులు వసూలు చేసినట్లు కొందరు విద్యార్థులు చెబుతున్నారు. దీనిపై ఆసుపత్రి ఇన్‌చార్జి ఏడీ అనిల్‌కుమార్ రెడ్డిని వివరణ కోరగా.. ఈ విషయం తన దృష్టికి రాలేదని వివరణ ఇచ్చారు.

## డీఈవోకు సన్మానం

**కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 31:** స్థానిక చెక్‌పోస్టు సమీపంలో ఉన్న మేఘన సిరీ ఫంక్షన్ హాలులో డీఈవోగా పదవీ విరమణ పొందిన వి. రంగారెడ్డిని బుధవారం సన్మానించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీ-1 శ్యామేల్ పాల్, ఏడీ-2 శ్రీనివాసులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సమ్మెను ఉధృతం చేస్తాం



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న సెర్ప్ ఉద్యోగులు

**కర్నూలు(కలెక్టరేట్), జనవరి 31:** తమ సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని సెర్ప్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం వాల్మీకి సర్కిల్‌లో సెర్ప్ ఉద్యోగులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ పే స్కేలు అమలు చేయాలని, రెగ్యులర్ చేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెహమాన్ , కృష్ణుడు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఆరోపణలు తగవు : ఎమ్మెల్యే

**కల్లూరు, జనవరి 31:** సోషల్ మీడియా వేదికగా తనపై చేస్తున్న ఆరోపణలను నిరూపించగలరా? అని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి టీడీపీ నేతలను ప్రశ్నించారు. బుధవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. పాణ్యం టీడీపీ ఇన్‌చార్జ్ గౌరుచరిత చేస్తున్న ఆరోపణలు సరికాదన్నారు. తనపై చేస్తున్న ఆరోపణలను నిరూపించాలని లేనిపక్షంలో న్యాయపరంగా ముందుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎస్.శ్రీధర్‌రెడ్డి, హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే జన్మదినం

**కర్నూలు(న్యూసిటీ), జనవరి 31:** నగరంలో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని కార్పొరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పలు వార్డులలో కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. గోరక్షణ మహా సంఘం ఆధ్వర్యంలో గోశాలలో పూజలు నిర్వహించారు. ఉచిత వైద్య, కంటి వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

## షర్మిల పర్యటన విజయవంతం: డీసీసీ



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు కే బాబురావు

**కర్నూలు(అర్బన్), జనవరి 31:** పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జిల్లా పర్యటన విజయవంతమైందని డీసీసీ అధ్యక్షుడు కే బాబురావు అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 29న జిల్లాలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆమె దిశానిర్దేశం చేశారని తెలిపారు. నగర అధ్యక్షుడు జాన్‌విల్సన్, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, డీసీసీ ఉపాధ్యక్షుడు బీ బ్రతుకన్న, కే.వెంకటరెడ్డి, సత్యనారాయణ, లాజరస్, మహిళా నాయకు రాళ్లు వెంకట సుజాత, ప్రమీల పాల్గొన్నారు.

## దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

**కర్నూలు(న్యూసిటీ), జనవరి 31:** నగరంలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు కోరారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం కార్పొరేషన్ ఎదుట సీపీఐ నగర కార్యదర్శి కే.రామక్రిష్ణారెడ్డి అధ్యక్షతన దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వేదిక నాయకులు మనోహర్ మాణిక్యం మాట్లాడుతూ నగరంలోని కాలువలను శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్‌గా ఫాగింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి సి.మహేష్, ఎస్‌డీపీఐ నాయ కులు అబ్దుల్లా, సీపీఎం నాయ కుడు సుధాకరప్ప పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

# టీబీ నివారణలో వైద్య సిబ్బంది పాత్ర కీలకం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డి

**కర్నూలు(హాస్పిటల్), జనవరి 31:** క్షయ వ్యాధి నియంత్రణలో వైద్యసిబ్బంది పాత్ర ఎంతో కీలకమని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ వి.వెంకటరంగారెడ్డి అన్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ధన్వంతరీ హాలులో బుధవారం టీబీ ముక్త్ భార త్ ఐపీసీ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ఉన్న వైద్యులు, సిబ్బంది అంటువ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆసుపత్రిలో క్రిమిసంహారక స్టెరిలేజేషన్, చేతి పరిశుభ్రత ఐసోలేషన్‌లో జాగ్రత్తలు మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ విషయాలను వివరించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా షేర్ ఇండియా అసోసియేట్ ప్రాజెక్టు డైరెక్టర్ సతీష్ కపిల్వావార్ పాల్గొని మాట్లాడారు. సదస్సులో ప్రిన్సిపాల్ పి.సుధాకర్, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, మైక్రో బయాలజి ప్రొఫెసర్ రేణుకాదేవి, హెచ్‌వోడీలు శ్రీలక్ష్మి, సీతారామయ్య రామ్‌బాలాజి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్లు శివబాల, సునీల్, ప్రశాంత్, కిరణ్ కుమార్, ఐసీఎన్ కన్సల్టెంట్ నీరజ పాల్గొన్నారు.

## పారా ఒలింపిక్స్ విజేతకు సన్మానం



షేక్ జాఫ్రిన్, నూతన జూనియర్ సివిల్ న్యాయాధికారులను సన్మానిస్తున్న వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు

**కర్నూలు(లీగల్), జనవరి 31:** పారా ఒలింపిక్స్ క్రీడలలో పతకం సాధించిన స్థానిక న్యాయవాది కూతురు షేక్ జాఫ్రిన్‌కు జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు కరణం కిషోర్ కుమార్ ఘనంగా సన్మానించారు. స్థానిక వినియోగదారుల కమిషన్ కార్యాలయంలో ఆమెతోపాటు ఇటీవల జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన ఇద్దరు మహిళా న్యాయవాదులు జశ్వంతియాదవ్, శివనమ్రతలు మర్యాదపూర్వకంగా వినియోగదారుల కమిషన్ చైర్మన్‌ను కలిశారు. వీరిని కూడా ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసుత్త పోటీ ప్రపంచంలో కర్నూలు మహిళలు రాణించడం అభినందనీయమన్నారు.

## పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న అధికారులు

**సి.బెళగల్, జనవరి 31:** రైతులు పండ్లతోటల పెంపకంపై దృష్టి సారించాలని ఏపీవో లక్ష్మన్న సూచించారు. బుధవారం మండలంలోని ముడుమాల గ్రామ పంచాయతీలో సన్నకారుల రైతులతో మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు ఉన్న సన్న కారు రైతులు, జాబుకార్డు ఉన్న రైతు కూలీలు పండ్లతోటలను పెంచుకోవడానికి ముందుకు రావాలని సూచించారు. ఈసీ పృథ్వీరాజ్, టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్లు, గ్రామ సర్పంచ్ బతుకమ్మ పాల్గొన్నారు.

## బంద్‌ను జయప్రదం చేయండి

**కర్నూలు(న్యూసిటీ), జనవరి 31:** ఈ నెల 16న జరిగే రవాణ రంగం బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ అన్నారు. బుధవారం కార్మిక కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రపతి ఆమోదం పొందిన 106(1), (2) చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ చట్టం అమలుతో వివిధ రంగాల డ్రైవర్లకు జైలు శిక్షలు, భారీ జరిమానాలు ఉంటాయని అన్నారు. భారతా శిక్షా స్మృతి 1980 చట్టం ప్రకారం డ్రైవర్ తప్పు చేస్తే సెక్షన్ 304-ఏ ప్రకారం రూ.1500 జరిమానా, రెండేళ్ల జైలు శిక్ష విధించేవారన్నారు. ఇది సరిపోదు అన్నట్లుగా కేంద్ర ప్రభుత్వం హిట్ అండ్ రన్ పేరుతో కొత్త చట్టా లను తీసుకువచ్చి డ్రైవర్ల మెడకు ఉరితాడు బిగించడానికి ప్రయత్నాలు చేస్తుందని విమర్శిం చారు. ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి కే.ప్రభాకర్, ఎయిర్ బస్ వర్కర్స్ యూనియన్ నాయకుడు శ్రీను, స్కూల్ బస్ యూనియన్ నాయకులు సిద్ధయ్య, రఘు, వలి పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై విచారణ జరిపించాలి: సీపీఎం



రోడ్డు పనులను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

**కర్నూలు(న్యూసిటీ), జనవరి 31:** నగరంలోని 49వ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులపై విజిలెన్సుచే విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. బుధవారం 48, 49వ వార్డుకు మధ్యలో మెయిన్ రోడ్డు నుంచి రోజా దర్గా వరకు వెళ్లే రోడ్లు (రాధాకృష్ణ హస్పిటల్) రహదారిలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సీపీఎం బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ వైసీపీ కార్పొరేటర్ కృష్ణకాంత్ తన పలుకుబడిని ఉపయోగించి బాగున్న సీసీ రోడ్డుపై మళ్లి సీసీ రోడ్డును వేయి స్తూ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ఎం. రాజశేఖర్, అబ్దుల్ దేశాయ్, రామక్రిష్ణ, షరీఫ్ పాల్గొన్నారు.

## తాగునీరు అందించలేకపోవడం సిగ్గుచేటు



కుంటను చూపుతున్న సీపీఎం నాయకులు

**కోడుమూరు(రూరల్), జనవరి 31:** కొత్తూరు గ్రామస్థులకు తాగునీరు అందించలేకపోవడం సిగ్గుచేటని సీపీఎం మండల కార్యదర్శి గఫూర్‌మియా అన్నారు. మంగళవారం గ్రామంలోని తాగునీటి కుంటను సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ వైఎస్సార్ సుజల స్రవంతి కింద రిమోట్ డిస్పెన్సింగ్ యూనిట్ ద్వారా తాగునీరు అందడం లేదని, గత్యంతరం లేక కుంట నీటినే తాగుతున్నామన్నారు. సీపీఎం గఫూర్ మియా మాట్లాడుతూ ఓ చిన్న గ్రామానికి పాలకులు, అధికారులు తాగునీరు అందిం చలేకపోవడం సిగ్గుచేటని అన్నారు. శ్రీనివాసులు, బాబయ్య, అయ్యన్న, ఖాజా హుసేన్, శంకరయ్య, పుల్లమ్మ, హుసేనమ్మ పాల్గొన్నారు.

## కార్పొరేషన్‌లో ముగిసిన వేలం

**కర్నూలు(న్యూసిటీ), జనవరి 31:** నగర పాలక సంస్థకు సంబంధించి పార్కింగ్ స్థలాలు, కింగ్ మార్కెట్ ఒక్క సంవత్సరం లీజుకు ఇచ్చేందుకు నిర్వహించిన వేలం ముగిసింది. బుధవారం కార్యాలయంలోని పాతకౌన్సిల్ హాలులో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ పర్యవేక్షణలో బహిరంగ వేలం నిర్వహించారు. పెద్దమార్కెట్ ఆవరణలోని కూరగాయల చిల్లర వ్యాపారం, కుండలు రూ.6.35,000, చేపల మార్కెట్ సైకిల్ పార్కింగ్ రూ.1,35,000, నగర పాలక సంస్థ కార్యాలయ పార్కింగ్ రూ.1,12,000కు వేలంలో దక్కించుకున్నారు. దీంతో కార్పొరేషన్‌కు రూ.9 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ జునైద్, ఆర్ఐలు మన్సూర్, వాజిద్, సొహైల్, రాజు, ఖలీల్, సాజిద్ పాల్గొన్నారు.

# ఆదోని

## డీటీఎఫ్ రజతోత్సవ సభలను జయప్రదం చేయండి

**ఎమ్మిగనూరుటౌన్, జనవరి 31:** డీటీఎఫ్ రజతోత్సవ మహాసభలు ఈ నెల 10, 11తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహిస్తున్నామని, ఉపాధ్యాయులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోట్ల చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు కరె కృష్ణ కోరారు. బుధవారం పట్టణంలోని డీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. మహాసభలు ఫిబ్రవరి 10, 11 తేదీల్లో విశాఖపట్నంలోని డాబాగార్డెన్‌లో జరగనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వరరెడ్డి, వెంకటేశప్ప, రామన్న, శ్రీనాథరెడ్డి, శివశంకర్, చిన్నవీరేష్, సోమేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## స్కూల్ అనుమతులు రద్దు చేయాలి

**గోనెగండ్ల, జనవరి 31:** మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జీనియస్ గ్లోబల్ స్కూల్ అనుమతులను రద్దు చేసి పాఠశాలను మూసివేయాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్‌అఫ్రిద్, రాయలసీమ యూనైటెడ్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ డిమాండ్ చేశారు. బుధవారం పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాఠశాలకు అక్రమంగా అనుమతులు ఇచ్చారంటూ అప్పటి ఎంఈవో వినోద్‌కుమార్ చిత్రపటాలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీనియస్ గ్లోబల్ స్కూల్ పెట్రోల్ బంకు గోడకు ఆనుకొని ఉందని, ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్యం ఇచ్చిన ముడుపులు తీసుకొని అక్రమంగా అనుమతులు ఇచ్చారని ఆరోపించారు. జగనన్న విద్యాకానుక రవాణా ఖర్చులలో రూ. 1.50 లక్షలను స్వాహా చేసిన ఆరోపణలను ఎంఈవో వినోద్‌కుమార్ ఎదుర్కొటున్నారని ఆయన పై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్‌ప్రకాష్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

## మహిళలకు ఉచిత శిక్షణ అభినందనీయం

● డీఎస్పీ శివనారాయణ స్వామి



సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న డీఎస్పీ శివనారాయణ స్వామి

**ఆదోని టౌన్, జనవరి 31 :** స్థానిక లక్ష్మమ్మ అవ్వ టౌన్ బ్యాంకు ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వడం అభినందనీయమని డీఎస్పీ శివనారాయణ స్వామి అన్నారు. బుధవారం సాయంత్రం అవ్వ బ్యాంకు సమావేశం హాల్లో టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న 74 మంది మహిళలకు అయన సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణా శిబిరం ద్వారా రెండు వేల మందికి పైగా మహిళలు శిక్షణ పూర్తి చేసుకోవడం సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. బ్యాంక్ ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య శెట్టి, డైరెక్టర్లు సుధాకర్ శెట్టి, దినకర్ శెట్టి, దినకర్ పాటిల్, శ్రీనివాసులు, అశ్వత్ నారాయణ, హుస్సేన్ అహ్మద్, ఆర్ఎంజీ రెడ్డి, సుధాకర్, సురేష్ గుప్తా, ఆర్‌సుబ్బయ్య, బ్యాంక్ మేనేజర్ జుల్ఫికర్, కుట్టు శిక్షణ కేంద్రం నిర్వాహకుడు నసీరుద్దీన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## మద్దికెరలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలి



గుంతకల్లు డీఆర్ఎం వినిత్‌సింగ్‌కు వినతి పత్రం ఇస్తున్న సునీల్ కుమార్

**మద్దికెర, జనవరి 31:** మద్దికెర రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలని గుంతకల్లు డీఆర్ఎం వినిత్‌సింగ్‌కు ఆపద్బాంధవ సేవా సమితి అధ్యక్షుడు చొక్కా సునీల్ కుమార్, ఆర్‌జీఐ కార్యకర్త రామ్మోహన్ కోరారు. ఈ మేరకు నూతనంగా బాధ్యతలు చేపట్టిన గుంతకల్లు డీఆర్ఎంను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మద్దికెర రైల్వేస్టేషన్‌లో కరోనా కంటే ముందు నుంచి అమరావతి, వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు హైదరాబాదు ఎక్స్‌ప్రెస్‌లు కూడా నిలుపుదల చేశారన్నారు. కరోనా తర్వాత రైళ్లను నిలుపుదల చేయలేదని, అప్పటి నుంచి ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు.

## తలనీలాల పాట వాయిదా

**మద్దికెర, జనవరి 31:** మండలంలోని పెరవలి గ్రామంలోని రంగనాథ స్వామి ఆలయ తలనీలాల వేలం పాటలు బుధవారం ఐదోసారి కూడా వాయిదా పడింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ చైర్మన్ ఈడిగ దస్తగిరి గౌడు ఆధ్వర్యంలో వేలం పాట వేయాలని చూశారు. గత ఏడాది 2023 ఫిబ్రవరి 6 నుంచి 2024 ఫిబ్రవరి 6వ తేదీ వరకు తలనీలాల వేలం పాట రూ.16.10 లక్షలకు పలికింది. ఈ ఏడాది వేలంలో పాల్గొన్నవారు తక్కువకు పడడంతో వరుసగా వాయిదా పడుతూ వచ్చింది. బుధవారం 5వ సారి వేలం పాట నిర్వహించగా ఒక్కరూ కూడా వేలం పాట పాడకపోవడం విశేషం. ఫిబ్రవరి 6నాటికి సమయం ముగుస్తుంది. అయినా అధికారులు రెండోసారి తిరిగి ఫిబ్రవరి 12వ తేదీకి వాయిదా వేశారు.

## నాటుసారా స్థావరాలపై దాడులు

**దేవనకొండ, జనవరి 31:** మండలంలోని మాచాపురం గ్రామ పరిసరాలలో నాటుసారా తయ్యారి స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. దాడులలో రెండు వందల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. గ్రామంలోని రౌడీషీటర్ల, అనుమానిత వ్యక్తుల ఇళ్లను తనిఖీలు చేశారు. అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లని హెచ్చరించారు.

## ఘనంగా సుంకులమ్మ దేవర

**మద్దికెర, జనవరి 31:** బొమ్మనపల్లి గ్రామంలో ప్రతి ఐదేళ్లకు ఒకసారి జరుపుకునే సుంకులమ్మ దేవర ఘనంగా జరిగింది. బుధవారం తెల్లవారుజామున మూలవిరాట్ సుంకులమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. అనంతరం అమ్మవారికి గ్రామంలోని మహిళలందరూ బోనాలతో తరలివచ్చి నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో పత్తికొండ ఎమ్మెల్యే కె.శ్రీదేవి, టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు, తుగ్గలి నాగేంద్ర, సర్పంచ్ బొమ్మనపల్లి అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా మారెమ్మ దేవర

**వెల్దుర్తి, జనవరి 31 :** మండలంలో గోవర్ధనగిరి గ్రామంలో బుధవారం మారెమ్మ దేవర కన్నుల పండువగా గ్రామస్తులు నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మారెమ్మతోపాటు సుంకులమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మలకు బోనాలలో నైవేద్యం సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఐదేళ్లకోసారి నిర్వహించే ఈ ఉత్సవాలకు ప్రజలు తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామం మొత్తం ఆడపడుచులు, బంధువులతో కళకళలాడింది. పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు.

## ప్రభుత్వం నిర్ణయం సరికాదు

**ఆలూరు, జనవరి 31 :** డీఎస్సీ ఉపాధ్యాయుల నియామకాల్లో అప్రెంటిస్ విధానానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం సరైన నిర్ణయం కాదని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నాగరాజు మండిపడ్డారు. బుధవారం స్థానిక ఎంఆర్‌సీ భవన్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. పోరాడి సాధించుకున్న హక్కులను అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఒక్కొక్కటి తీసివేస్తున్నాయన్నారు. ప్రపంచ బ్యాంక్ నిబంధనలు అమలులో భాగంగా అప్రెంటిస్ విధానాన్ని ప్రవేశపెడుతున్నదని ఆరోపించారు.

# అధికారులూ ఈ వంక చూడరూ!

వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కబ్జాల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. ఎక్కడ ప్రభుత్వ స్థలం కనిపించినా అధికార పార్టీ నేతలు దర్జాగా కబ్జా చేస్తున్నారు. తాజాగా ఓ ప్రజాప్రతినిధి ఏకంగా వంక స్థలాన్ని ఆక్రమించి ఏకంగా ఇంటి నిర్మాణం చేపట్టాడు.

● దర్జాగా వంక భూమి కబ్జా !
● పత్తికొండలో ఓ ప్రజాప్రతినిధి నిర్వాకం
● వంకను పంచుకొని అక్రమ నిర్మాణాలు
● పట్టాలిచ్చారంటూ బెదిరింపులు
● చోద్యం చూస్తున్న అధికారులు

**పత్తికొండ టౌన్, జనవరి 31:** పత్తికొండ-ఆదోని రహదారిలో ఈరన్నస్వామి దేవాలయం ఎదురుగా ప్రధాన రోడ్డుకు ఆనుకొని 616 సర్వే నెంబరులో జగనన్న లే అవుట్ కింద పత్తికొండ పట్టణ నిరుపేదలకు 232 మందికి ఇంటి స్థలాలను కేటాయించారు. అదే సర్వే నెంబరులో పై ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరు అంతా ఆ కాలనీలో ఓ మూలన దిగువ ప్రాంతంలో ఉన్న వంకలో కలుస్తోంది. అయితే, జగనన్న కాలనీ లేవుట్ కింద అక్కడ స్థలాలు ఇవ్వడం, ఈరన్న స్వామి దేవాలయం అభివృద్ధి చెందడంతో అక్కడున్న స్థలాలకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ఆ వంక పోరంబోకు స్థలం ఖాళీగా ఉండటంతో ఆ స్థలంపై కన్నేసిన అధికార పార్టీ ప్రజాప్రతినిధి ఏకంగా ఆ స్థలంలో ఇంటి నిర్మాణానికి పునాదులు వేసి మొదలు పెట్టారు. ఆయనను చూసి మరికొంత మంది రాజకీయ నాయకులు కూడా పోరంబోకు వంకలో ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. వంక పోరంబోకులో నిర్మాణాలు చేపట్టారని ప్రశ్నిస్తే.. తమకు రెవెన్యూ అధికారులు పట్టాలు ఇచ్చారని, అందుకే ఇళ్ల నిర్మాణాలు చేపట్టామని ఆక్రమణదారులు అంటున్నారు. ఇది చూస్తోంటే ఈ కబ్జాల పర్వం ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతోంది.



వంక పోరంబోకులో అక్రమ నిర్మాణాలు చేపట్టిన దృశ్యం

పేదలందరికీ సెంటున్నర స్థలం ప్రకారం స్థలాలను కేటాయిస్తే.. అక్రమార్కులు మాత్రం ఏకంగా రెండు సెంట్లకు పైగా స్థలాల్లో నిర్మాణాలు చేపట్టారు. ఈ తతంగమంతా రోడ్డుకు ఆనుకుని కబ్జాల అక్రమాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడం చూస్తుంటే.. వారి అండదండలతోనే ఈ అక్రమ ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు అక్రమ చేపడుతున్న ఈ స్థలంలోనే భారీ కల్వర్టును ఈ మధ్యలోనే నిర్మించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ఆ స్థలంలో పట్టాలు ఇచ్చారా.. లేక అక్రమ నిర్మాణాలు చేపట్టారా అన్న కోణంలో దర్యాప్తు చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు వాపోతున్నారు.

**అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తాం**

జగనన్న లే అవుట్ 616 సర్వే నెంబరులో రోడ్డుకు ఆనుకుని ఉన్న స్థలం (వంక పోరంబోకు)లో ఖాళీ స్థలంగా రిజర్వు చేశాం. అందులో ఎవరికీ పట్టాలు ఇవ్వలేదు. ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు. అవసరమైతే అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తాం. గతంలో వంకకు ఆనుకుని కొంత మంది అక్రమ నిర్మాణాలు చేపట్టినప్పుడు వాటిని తొలగించాం. ఈ స్థలంలో వంక పోరంబోకులో ఎవరైనా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు.

- ఈశ్వర్ ప్రసాద్, తహసీల్దార్

# ప్రజా సమస్యలు గాలికి..

● అర్ధాంతరంగా ముగిసిన కౌన్సిల్ సమావేశం
● ప్రజా సమస్యలపై మాట్లాడకుండా చేసిన చైర్మన్
● కార్యాలయం ఎదుట బైఠాయించి టీడీపీ కౌన్సిలర్లు



మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన టీడీపీ కౌన్సిలర్లు దయాసాగర్, రంగస్వామి గౌడ్

**ఎమ్మిగనూరు, జనవరి 31 :** చైర్మన్ డాక్టర్ రఘు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం అర్ధాంతరంగా ముగిసింది. ప్రజా సమస్యలు గాలికి వదిలేసి అధికార పార్టీ ప్రాపకాన్ని చాటుతూ వైస్‌చైర్మన్ నజీర్ రాజకీయ ప్రసంగం చేస్తుండగా టీడీపీ ఫ్లోర్ లీడర్ దయాసాగర్, కౌన్సిలర్ రామదాసుగౌడ్ అభ్యంతరం తెలపడంతో సభలో గందరగోళం నెలకొంది. ఇదే అదునుగా భావించిన చైర్మన్ డాక్టర్ రఘు సమావేశాన్ని బెల్‌కొట్టి ముగించడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

కౌన్సిల్‌లో దయాసాగర్ మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశాన్ని రాజకీయ సమావేశంగా మార్చడం సబబుకాదని హితవు పలికారు. 20రోజుల క్రితం పట్టణంలోని 32వ వార్డులో అధికార పార్టీకి చెందిన నాయకుడు నీటి ట్యాంకును ధ్వంసం చేశారని, దీనిపై కాలనీ వాసులు కమిషనర్‌కు ఫిర్యాదుచేసినా ఎందుకు స్పందించ లేదని ప్రశ్నించారు. పట్టణంలోని సోమప్ప సర్కిల్‌తో పాటు ఆయా రహదారుల్లో 20రోజులక్రిం రు.8లక్షలు వెచ్చించి బీటీ ప్యాచీలు వేశారని, బీటీ రోడ్లు వేసే ముందు ప్యాచీలు ఎలా వేస్తారని ప్రశ్నించారు. వైస్ చైర్మన్ నజీర్ కలుగజేసుకొని ప్యాచీలు వేయలేదని చెప్పుకొచ్చారు. దీంతో దయాసాగర్ ప్యాచీలు వేయలేదని కమిషనర్ చెప్పాలని డిమాండ్ చేశారు.

### ప్రధాన ద్వారం ఎదుట కౌన్సిలర్ల బైఠాయింపు

సమస్యలు ప్రస్తావించకుండా ఇలా సభను ముగించడం ఏమిటంటూ టీడీపీ సభ్యులు కార్యాలయ ప్రధాన ద్వారం బైఠాయించి నిరసన తెలిపారు. ప్రజా సమస్యలపైనా.. బిల్లుల పెండింగులపైనా.. ప్రజా ధనం దుర్వినియోగంపై ప్రశ్నిస్తామనే అక్కసుతో చైర్మన్ కౌన్సిల్ సమావేశాన్ని అర్ధాంతరంగ ముగించి ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని టీడీపీ ఫ్లోర్ లీడర్ దయాసాగర్, కౌన్సిలర్ రామదాసు గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ గంగిరెడ్డికి బాగున్న రోడ్లపైనే రోడ్లు వేయటం, కలర్ కలర్ లైట్లు వేయడంలో ఉన్న ఆసక్తి కలుగొట్ల రోడ్డు ఎస్సీకాలనీలో గుంతలమయంగా మారిన రోడ్డును వేయటంలో లేదని విమర్శించారు. కమిషనర్, వైస్ చైర్మన్ కుమ్మక్కై రియల్ ఎస్టేట్ వారినుంచి దండుకుంటున్నారని, వీటిని ప్రశ్నిస్తామనే వైస్‌చైర్మన్ మమ్మల్ని మాట్లాడకుండా అడ్డుకుంటున్నాడని ఆరోపించారు.

# వైసీపీ పాలనలో రైతుకు కన్నీరు

● టీడీపీ అధికారంలోకి రాగానే ఏటా రూ.20 వేలు ఇస్తాం
● నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు



ఊరేగింపుగా వస్తున్న నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు

**మద్దికెర, జనవరి 31:** రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు మేలు చేసిందేమీ లేదని, వారి కంట కన్నీరే మిగిలిందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు, రాష్ట్ర శాలివాహన ఫెడరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర అన్నారు. బుధవారం మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో సుంకులమ్మ దేవర ఉత్సవాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేఈ శ్యాంబాబు, తుగ్గలి నాగేంద్రలను టీడీపీ శ్రేణులు ర్యాలీగా వెంట వచ్చి సుంకులమ్మకు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం సర్పంచు బొమ్మనిపల్లి ఆంజనేయులు స్వగృహంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చంద్రబాబును వచ్చే ఎన్నికల్లో గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే.. రైతులకు ప్రతి యేటా ప్రభుత్వం నుంచి రూ.20వేలు ఇస్తామని పేర్కొన్నారు. పెట్టుబడి సాయం, గిట్టుబాటు ధరలేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో రైతులకు డ్రిప్పు ఇవ్వడం లేదన్నారు. రాయితీ కింద ఎరువులు, విత్తనాలు కూడా ఇవ్వలేదని, ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా రైతులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో బొమ్మనపల్లి ఆంజనేయులు, అశోక్ కుమార్, రామగోవిందు, ఎర్రిస్వామి, సోషల్ మీడియా కన్వీనర్ హుశేన్‌పీరా, రాతన మనోహర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# ఆదోనికి చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్ర

**ఆదోని, జనవరి 31 :** వైసీపీ ప్రభుత్వం కార్మికుల కడుపు కొట్టిందని టీయన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామ కృష్ణం రాజు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చైదరి అన్నారు. టీయన్‌టీయూసీ ఆధ్వర్యంలో టెక్కలి టీడీ కుప్పం చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్రకు కార్మికులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎన్‌టీఆర్ విగ్రహనికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ రెడ్డి ప్రభుత్వం అన్ని రకాల కార్మికులను కార్మిక వ్యవస్థలను నాశనం చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసినారని విమర్శించారు. గత ప్రభుత్వంలో ఉచిత ఇసుక ఇవ్వడం, ఆదరణ పథకాల ద్వారా పనిముట్లు పంపిణీ చేసిన ఘనత టీడీపీకే దక్కిందన్నారు. భవన నిర్మాణ కార్మిక కుటుంబ సభ్యులకి ప్రమాద బీమా, పెళ్లికానుక, అన్న క్యాంటీన్ల ద్వారా రూ.5కే కడుపునిండా భోజనం పెట్టిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ల లాగా కొనసాగాలంటే మళ్లీ చంద్రన్న పాలన రావాలని అన్నారు. రాష్ట్రమంతటా కార్మిక చైతన్య బస్సు యాత్రతో కార్మికుల చైతన్యం చూస్తామన్నారు. ఆదోనిలో టీడీపీ, జనసేన అభ్యర్థిని గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అశోక్ కుమార్, జీ నరసింహులు యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్, శివాజీ, బుద్ధారెడ్డి, వెంకటేష్, లక్ష్మీనారాయణ, జయరాం, రాజు, దుబ్బ రామాంజి, ఈరన్న, సజ్జద్, రామకృష్ణ, విరుపాక్షి పాల్గొన్నారు.



ఆలూరులో కార్మిక చైతన్య యాత్రలో మాట్లాడుతున్న రఘురామరాజు

### ఆలూరుకు చేరిన కార్మిక చైతన్య యాత్ర

**ఆలూరు :** టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో చంద్రన్న కార్మిక చైతన్య యాత్ర బుధవారం ఆలూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు కార్మిక చైతన్య యాత్రకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రఘురామరాజు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమాన్ని జగన్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఔట్ సోర్సింగ్ కార్మికులకు పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కార్మికుల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేసిందని గుర్తు చేశారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్, రాష్ట్ర కార్యదర్శి నరసింహులు యాదవ్, జిల్లా నాయకులు సురేంద్ర, నరసప్ప, మండల నాయకులు ముద్దురంగ, గూళ్యం రామాంజినేయులు, ఆంజనేయులు, గుండన్న, హనుమప్ప పాల్గొన్నారు.

### ఆదరించండి అభివృద్ధి చేసి చూపిస్తా

**హొళగుంద, జనవరి 31 :** ఆలూరు నియోజవర్గం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని అదరిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా అని ఆలూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి విరుపాక్షి అన్నారు. బుధవారం హొళగుందలో వైసీపీ కార్యాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో అందరినీ కలుపుకుపోయి వైసీపీని బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ షఫీ యుల్లా, కొగిలాతోట శేషప్ప, దొడ్డ బసప్ప, దుర్గ ప్రసాద్, ఎంపీటీసీ శివన్న, ఎస్‌కేగిరి, హెబ్బటం రంగప్ప, మజ్జిగ సిద్దప్ప తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు

**మంత్రాలయం, జనవరి 31 :** మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. బుధవారం శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో బృందావనంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం చేసి వెండి, బంగారు, పట్టు వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వర్ణ రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ చేశారు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు తరలిరావడంతో మఠం ప్రాంగణం కిక్కిరిసింది.



స్వర్ణ రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

## కార్యకర్త మృతి పార్టీకి తీరనిలోటు : టీడీపీ

**కౌతాళం, జనవరి 31:** మండల పరిధిలోని హల్వి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త రమేష్ మృతి పార్టీకి తీరనిలోటని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి అన్నారు. బుధవారం టీడీపీ మండల నాయకులు చెన్నబసప్ప, అడివప్పగౌడ్, వెంకటపతిరాజుతో కలసి పార్థీవ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా దివాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 28న పత్తికొండలో టీడీపీ నిర్వహించిన రా..కదలిరా కార్యక్రమానికి రమేష్ హాజరై తిరిగి వస్తుండగా అస్వస్థతకు గురై కర్నూలులో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. పార్టీకి రమేష్ చేసిన సేవలు మరవలేనివని కొనియాడారు. అంత్యక్రియల కోసం మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి ఆదేశాల మేరకు రూ.40వేలు ఆర్థిక సాయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. గ్రామ నాయకులు వడ్డే ఉసేని, దర్గా మౌల, మల్లప్పగౌడ్, సిద్దు ఉన్నారు.

## తాగునీటి కోసం బావిలో పూడిక తీత

**తుగ్గలి, జనవరి 31:** బావి పూడికతో నిండిపోయి తాగునీరు సక్రమంగా అందక గ్రామంలో నీటి కష్టాలు తలెత్తడంతో సర్పంచు రంగమ్మ, టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి బావిలో పూడికతీత పనులు చేపట్టారు. బుధవారం చెన్నంపల్లిలో చెరువుకట్ట పక్కనే ఉన్న బావిలో పూడిక పేరుకుపోయి తాగునీరు అందకపోవడంతో వేసవి కాలంలో తాగునీటి సమస్య ఏర్పడుతుందని బావిని ఎక్స్‌కవేటర్‌తో బావిలో పూడికతీత చేయించి లోతును ఏర్పాటు చేశారు. దీంతో బావిలో నీటి ఊట పెరిగి గ్రామానికి తాగునీటి సమస్య తీరుతుంది. పంచాయతీల్లో ఒక్కరూపాయి నిధులు కూడా లేదని అప్పులు చేసి మరీ ఈ పనులు చేయాల్సి వస్తోందని సర్పంచు వాపోయారు. సొంత నిధులతో పనులు చేయిస్తున్నామని అన్నారు. టీడీపీ నాయకులు మాబాషా, రామయ్య, తదితరులు ఉన్నారు.

## 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు

**దేవనకొండ, జనవరి31:** మండలానికి 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరైనట్లు ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ తెలిపారు. 26 గ్రామ పంచాయతీలకు గాను రూ.1,55,51,430 నిధులు వచ్చాయన్నారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్లు తదితర అవసరాల కోసం సర్పంచులు నిధులు ఉపయోగించుకోవాలని సూచించారు.

## అధిష్టానం ఆదేశిస్తే పోటీకి సిద్ధం

● కాంగ్రెస్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు

**ఆదోని టౌన్, జనవరి 31 :** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఆదేశిస్తే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి తాను సిద్ధమని పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎంఎండీ నూర్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనారిటీ ఓటర్ల సంఖ్య అధికంగా ఉన్న ఆదోనిలో కాంగ్రెస్ పార్టీను అభిమానించే మైనారిటీలకు చెందిన క్యాడర్ చెక్కుచెదర కుండా ఉందన్నారు. సరైన నాయకత్వం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు.

## రాఘవేంద్రుని సన్నిధిలో కర్ణాటక మాజీ ఉప ముఖ్యమంత్రి

**మంత్రాలయం, జనవరి 31 :** రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్నాటక రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి ఈశ్వరప్ప బధవారం రాత్రి మంత్రాలయం వచ్చారు. ఈయనకు ఆలయ మహా ముఖద్వారం వద్ద శ్రీ మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాస రావు, వెంకటేష్ జోషి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, బిందు మాధవ్ ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మఠం పండితులు రాఘవేంద్ర స్వామి జ్ఞాపిక, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈయన వెంట గిరీష్ కనకవీడు, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, వ్యాసరాజ ఆచార్, జయతీర్థ ఆచార్ పాల్గొన్నారు.

## హాలహర్వి ఎస్ఐగా నరేంద్ర

**హాలహర్వి, జనవరి 31 :** మండల సబ్ ఇన్‌స్పెక్టర్‌గా నరేంద్ర బాధ్యతలు చేపట్టారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంతంగా, స్నేహభావంతో మెలగాలని సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అసాంఘిక కార్యాకలపాలకు పాల్పడిన, గొడవలు సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హాలహర్వి ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నాగేంద్ర ఆదోని త్రీ టౌన్‌కు బదిలీ అయ్యారు.

## గ్రేడింగ్ పేరుతో వ్యాపారుల మోసం : రైతు సంఘం

**ఆదోని (అగ్రికల్చర్), జనవరి 31 :** వేరుశనగ రైతులను గ్రేడింగ్ పేరుతో వ్యాపారులు మోసం చేస్తున్నారని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మార్కెట్ యార్డ్ సూపర్వైజర్ నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో కర్నూలు, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులలో ఎక్కడలేని విధంగా ఆదోనిలో రైతులు తెచ్చిన వేరుశనగకు గ్రేడింగ్ చేస్తున్నారన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మార్కెట్ కమిటీ ప్లాట్‌పామ్‌పై ఆరబెట్టడమే కాకుండా గ్రేడింగ్ అంటూ నిలువన ముంచుతున్నారని పేర్కొన్నారు. అధికారులు మార్కెట్ కమిటీలో గ్రేడింగ్ లేకుండా నేరుగా కొనుగోలు జరిగేలా చూడాలని కోరారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ఎమ్మిగనూరు రూరల్, జనవరి 31 :** రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బతకన్న (36)అనే వ్యక్తి బుధవారం మృతిచెందాడు. గోనెగండ్ల మండలం అలువాల గ్రామానికి చెందిన బతకన్న నాలుగు రోజుల క్రితం భార్య రంగమ్మతో కలిసి బెళగల్‌లో చదువుతున్న తన కుమారుడిని చూసేందుకు మోటారు బైక్‌పై బయలుదేరారు. ఎనుగుబాల సమీపంలో ఎదురుగా వస్తున్న మరో మోటారు బైక్ ఢీకొనటంతో బతకన్నకు తీవ్ర గాయాలు కాగా, భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అక్కడ మూడు రోజులగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు.

## బీసీ పాయింట్‌లో చోరీ

**ఎమ్మిగనూరు, జనవరి 31 :** పట్టణంలోని స్టేట్‌బ్యాంకు సమీపలో పార్కు రోడ్డులో ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా బీసీ పాయింట్‌లో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు ఎల్లప్ప తెలిపిన సమాచారం మేరకు రోజు మాదిరిగానే బీసీ పాయింట్‌కు తళాలు వేసుకొని వెళ్లటం జరిగిందన్నారు. బుధవారం వచ్చి చూసే సరికి షట్టర్ తాళాలు పగలగొట్టి ఉన్నాయన్నారు. తెరచి చూస్తే బీసీ పాయింట్‌లో ఉన్న రూ.30 వేలు నగదును ఎత్తుకెళ్లారని, పోలీసులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.